# తామరపువ్వు-రోజ్‌ఫ్లవర్

గంటి రమాదేవి

రంగనాథం అతన్ని పరీక్షగా చూశాడు.

నల్లగా, లావుగా వున్నాడు. కార్తీక మాసంలో దీపాలు పెట్టుకోడానికి దూలానికి వేలాడదీసే తాటాకు గుమ్మడిపండులా గుండ్రంగా ఉన్నాడు. కుర్చీలో బెల్లంముద్దలా కూర్చున్నాడు.

రంగనాథం చిరునవ్వు నవ్వి అన్నాడు "చెప్పండి!" కొంచెం తటపటాయించి అన్నాడు ఆ మనిషి.

"నా పేరు జి.గుర్నాథం. జి అంటే గుమ్మడాల. గుమ్మడాల అనే వూరొకటుందట... ఆనీ వూరు మా పూర్వీకులు..."

రంగనాథం అతన్ని మధ్యలో ఆపి అడిగాడు.

"మీరు వచ్చిన పని..."

"ఆ... మీరు పెద్ద లాయరని, బాగా పేరుమోశారని, ముఖ్యంగా విడాకుల కేసులు మీరు తీసుకుంటే భార్యాభర్తలు ఖండితంగా విడిపోతారని తెలిసి వచ్చాను."

"మీకు మీ భార్యతో విడాకులు కావాలా?"

గుర్నాథం నిట్టూర్చి అన్నాడు "ఎలా చెప్పాలో తెలియడంలేదు. ఒక విడాకులు కాదు. రెండు..."

"ఒకసారి విడాకులు తీసుకుంటే చాలు... రెండుమూడుసార్లు అక్కర్లేదు" నవ్వుతూ అన్నాడు గుర్నాథం.

గుర్నాథం మరోసారి భారంగా నిట్టూర్చి అన్నాడు.

"అసలు సంగతి చెబుతా వినండి. నేను చదువుకునే రోజుల్లో ఓ అమ్మాయిని ప్రేమించాను. ఆ అమ్మాయి నన్ను ప్రేమించింది. ఎందుకో మా పెళ్ళి జరగలేదు. చదువయిపోగానే ఉద్యోగంలో చేరాను. పెద్దలు పెళ్ళి కూడా చేశారు. ఇద్దరు పిల్లలు. ట్రాన్స్‌ఫర్ మీద ఈ ఊరొచ్చి రెండు నెలలయింది.

ఆరువారాల క్రితం కూరగాయల మార్కెట్‌కు వెళ్ళాను. ఆదివారం... పెద్ద రద్దీలేదు. వంకాయలు బేరం చేస్తుండగా 'ఆవిడ' కనబడింది. క్షణకాలం నా మనస్సు పన్నెండేళ్ళ వెనక్కు వెళ్ళిపోయింది. మనస్సు బరువెక్కింది. నా ఆలోచనలలో నుండి తేరుకునే లోపలే ఆమె నన్ను చూసింది. దగ్గరగా వచ్చింది. నా కళ్ళలో కళ్ళు పెట్టి చూసింది. నూదంటురాయిలాంటి ఆ కళ్ళలో నా మనస్సు చిక్కుపడిపోయింది. ఇద్దరం దగ్గరగావున్న హోటలుకెళ్ళి కాఫీ త్రాగాం. వదలలేక వదలలేక ఆమెను వదిలి వెళ్ళాను. ప్రతీ ఆదివారం కూరగాయల మార్కెట్టుకు వస్తానని చెప్పింది ఆమె. ఆమే నా 'ప్రేయసి' చదువుకునే రోజుల్లో...

మరో ఆదివారం మళ్ళీ కలుసుకున్నాం. ఆమె కూడా నా పరిస్థితిలోనే ఉన్నట్టు గమనించాను. కాఫీహోటలులో కాఫీ తాగుతూ ఆమె చేతిని నా చేతిలోకి తీసుకున్నాను. ఆమె కళ్ళలోకి చూశాను. స్వచ్ఛమైన సరోవరపు అడుగున పడివున్న మణిలా ఆమె మనసు నాకు అవగతమయింది.

ఆమె వణుకుతూ నా చెయ్యి పట్టుకుంది.

"గురూ... నన్నింకా ప్రేమిస్తున్నావా?" అంది.

నేను మాట్లాడలేక పోయాను. ఆమె చేతిని నా హృదయానికి చేర్చుకున్నాను.

ఆ తర్వాత రోజూ మేమిద్దరం కలుసుకోవడం మొదలుపెట్టాం.. ఓరోజు ఆఫీసుకు సెలవుపెట్టి ఏకాంతంగా ఒక రూములో గడిపాం, ఆ అనుభవం మరుపురానిది. ఉక్కుతీగలాగా ఆ అనుభవం మమల్నిద్దరినీ బంధించింది. ఇంకా కావాలి ఆ అనుభూతి! శాశ్వతం కావాలి. ఎలా? ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు. నాకూ భార్యాపిల్లలు. ఎలా! ఈ ఆరువారాల్లో భరించరాని మానసిక వ్యధ అనుభవించాను. మేమిద్దరం ఒకరికోసం మరొకరం పుట్టాం. విధి వ్యతిరేకించి దూరమయ్యాం. ఈ ఆరు వారాల్లో నాలుగయిదు సార్లు అతికష్టంమీద కలుసుకోగలిగాం."

గుర్నాథం జేబురుమాలుతో కళ్ళు తుడుచుకుని మళ్ళీ అన్నాడు.

"మేమిద్దరమూ పెళ్ళి చేసుకోవాలను కుంటున్నాం"

రంగనాథం న్యాయవాద జీవితంలో ఇటువంటి కేసు ఏదీ రాలేదు. ఆశ్చర్యంగా గుర్నాథం చెప్పిందంతా విన్నాడు. ఈ బుద్ధావతారాన్ని అంతగా ప్రేమించిన ఆ యువతి కాదు ఆ స్త్రీ ఎలా వుంటుంది? ఈ కార్తీలాగే బెల్లంముద్దలా వుంటుందో? లేక ఎముకలమీద చర్మంతో సన్నగా ములక్కాడలా వుంటుందా? పెళ్ళయి పన్నెండేళ్ళయి ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత ప్రేమలోపడ్డ వీళ్ళని ఏమని పిలవాలి? అమర ప్రేమికులా?

రంగనాథానికి ప్రేమ గురించి అంతగా తెలియదు. ఒకటో రెండో ప్రేమకథలు చదివాడు. నాలుగైదు సినిమాల్లో అమరప్రేమను చూసి వాటిలో కృతకత్వానికి వెగటువేసి మళ్ళీ ప్రేమ సినిమాలు చూడకూడదనుకుని ఏక్షన్ సినిమాలే చూస్తున్నారు.

"మరి... మీరు విడాకులు తీసుకుంటారు. మరి ఆ అమ్మాయి భర్త ఆయన నప్పుకుంటాడా?" రంగనాథం అడిగాడు.

"లాయరుగారూ! అవన్నీ నాకు తెలియదు. మా ఇద్దరికీ పెళ్ళి చేసే బాధ్యత మీది. వాళ్ళు విడాకులు తీసుకున్నా మాకు బాధలేదు. విడాకులు తీసుకున్న నా భార్యా, ఆమె భర్తా పెళ్ళి చేసుకున్నా నేనేమీ అనుకోను... కానీ నా మాధవి నాకు కావాలి..." గుర్నాథం ఏడుపుముఖం పెట్టి అన్నాడు. గొంతు పెద్దది చేసి అన్నాడు మళ్ళీ... "ఎంత డబ్బయినా ఇస్తాను..."

గుర్నాథం వృద్ధప్రేయసి పేరు మాధవన్నమాట.

రంగనాథానికి ఏమీ పాలుపోలేదు. విడాకులు కావాలంటాడు. తనకొక్కడికే కాదు. ఇద్దరికీ... ఏ కారణాలు చూపాలి... విడాకులంటే అంత తేలికకాదని, భార్యాభర్తలు విడిగా కనీసం రెండేళ్ళయినా దూరంగా వుండాలని ఎలా చెప్పడం... ఆశగా చూస్తున్న గుర్నాథాన్ని జాలిగా చూసి అన్నాడు రంగనాథం.

"చూడండి. విడాకులు కావాలంటే బలమైన కారణాలు చూపాలి. భార్యో, భర్తో దీర్ఘరోగంతో బాధపడుతూ ఉండడమో, నపుంసకులయి ఉండడమో లేదా ఏ అక్రమ సంబంధం వుండడమో ఇలాంటి కారణాలు."

"ఆ భయం వద్దులెండి... నేను మాధవి అన్ని

ఏ కారణాలు చూపాలి. విడాకులంటే అంత తేలిక కాదని భార్యాభర్తలు విడిగా కనీసం రెండేళ్ళయినా దూరంగా వుండాలని ఎలా చెప్పడం? ఆశగా చూస్తున్న గుర్నాథాన్ని జాలిగా చూసి అన్నాడు రంగనాథం ...

ఆలోచించాం. మేమిద్దరం కలిసివున్న ఫోటోలు, మాధవి భర్తకు పంపుతాం. అలాగే నా భార్యకు కూడా... అలా అక్రమ సంబంధం రుజువు చేసుకుంటాం..." సంబరంగా అన్నాడు గుర్నాథం.

"ఏడిసినట్టుంది! ముందు మీరిద్దరూ 'ఎడల్టరీ'కింద కేసులో ఇరుక్కుంటారు... సరే... మీ దగ్గర మీ 'లవర్' ఫోటోవుందా?"

గుర్నాథం ప్యాంటు జేబులోంచి ఓ కవరు తీసి రంగనాథానికి ఇచ్చాడు.

రంగనాథం ఆ ఫోటో చూసి అవాక్కయ్యాడు. పిప్పళ్ళబస్తానో, తారుడ్రమ్మునో, బలిసిన మాటెనందినో 'ఎక్స్‌పెక్ట్' చేసిన రంగనాథం ఆ ఫోటోచూసి అదిరిపడ్డాడు. పట్టుదారాల్లా నల్లటిజుట్టు, గులాబీచాయలో గుండ్రటి ముఖం, చిన్ననోరు, చిరునవ్వు నవ్వినప్పుడు



బుగ్గన చిన్నసొట్ట, చెర్రీ పళ్ళలాంటి ఎర్రటి పెదాలు.

దేవకన్యలాంటి ఈమె ఎద్దులాంటి గుర్నాథాన్ని ప్రేమిస్తోందా? పడి ఛస్తోందా? రంగనాథం మనసులో ఓ క్షణం అసూయలాంటిది బయలుదేరి అణిగిపోయింది.

"ఆశ్చర్యపోకండి లాయర్‌గారూ! ఈ అమ్మాయి మాధవి కాదు. హిందీలో ఓ సూపర్‌స్టార్ ఫోటో అది. అలా వుంటుందని చెప్పడానికి ఆ ఫోటోని ఇచ్చాను... కానీ నా మాధవి సినీస్టార్‌కే మాత్రం తీసిపోదు..." గుర్నాథం అన్నాడు కుర్చీలోంచి లేస్తూ బయటకు నడుస్తూ అన్నాడు.

"నా జీవితం మీ చేతుల్లో వుంది... నాలో ప్రతి నరం, ప్రతి రక్తకణం మాధవినే కోరుతూ వుంది... ఆమె లేకుండా బ్రతకలేను..."

రంగనాథం చిన్నగా నవ్వి తల పంకించి అన్నాడు — "మంచిది... మీ కేసు విచిత్రమైనది. నేనేం చెప్పలేను

# ఆంధ్రభూమి
సచిత్రవారపత్రిక

❀ మీ కోసం ప్రత్యేకంగా ❀

గువ్వా గూడెక్కె

పాపా పాపా చావెప్పుడమ్మా

కోడాల కోడాల కొడుకు పెళ్ళామా

భస్మసింహాసనం

పాపాలభైరవుడు

లేడీ డాక్టర్

వైఫ్ డియర్ వైఫ్

పెళ్లి పెడాకులూ

లవ్ — ఎ — ఫయిర్

✱ మీ అభిమాన రచయిత(త్రు)లు ✱

పావనీ సుధాకర్

విజయలక్ష్మి మురళీధర్

మైనంపాటి భాస్కర్

శ్రీరంగం

ద్విభాష్యం రాజేశ్వరరావు

చక్కిలం విజయలక్ష్మి

ఎస్సార్ తురగా

డా. కె.వి.కృష్ణకుమారి

బొమ్మదేవర నాగకుమారి

✱ ఎవరెవరు ఏం రాస్తున్నారో వేరే చెప్పాలా! ✱


ఇప్పుడే... కానీ మీరు 'మాధవి'ని కలుసుకోవడం మంచిదికాదు."

గుర్నాథం కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి.

"అలా అనకండి... ఆమెను చూడందే నేనుండలేను. ఆమె నాకోసం ఎదురు చూస్తూ వుంటుంది. మా ఫ్యూచర్ ప్లాన్‌లు మాట్లాడుకోవాలి"

గుర్నాథం వెళ్ళిన తర్వాత నొసలు కొట్టుకున్నాడు రంగనాథం. ఎడ్రసు ఇవ్వకుండా వెళ్ళిపోయాడు గుర్నాథం. ఇప్పుడు రెండు అడ్రసులు కావాలి. గుర్నాథం భార్యది. మాధవి భర్తది...

"దిస్ కేస్ ఈజ్ ఎ ఫ్లాప్" అన్నాడు రంగనాథం అప్రయత్నంగా.

* * *

భోజనం చేస్తున్నంత సేపూ గుర్నాథం కేసు గురించే ఆలోచిస్తున్నాడు. పరధ్యానంగావున్న భర్తను అడిగింది రంగనాథం భార్య లత. "ఏమిటదోలా వున్నారు?" అని.

"ఏం లేదులతా! సాధారణంగా మనం టేకేజ్‌లవ్ చూస్తూవుంటాం. ఓ మిడిల్‌ఏజ్ ఫెలోవచ్చాడు ఇవ్వాళ. వాడి ప్రేమగొడవ, విడాకుల గొడవ, పెళ్ళిగొడవ అంతా తికమకగా వుంది... సరే... పాన్‌దాన్‌లో తమలపాకులున్నాయా?... తమలపాకుల వాడు ఈ మధ్యన మరీ ముదురువి ఇస్తున్నాడు..."

రంగనాథం చెయ్యి కడుక్కొని తాంబూలం నవులుతూ ఆలోచిస్తున్నాడు గుర్నాథం కేసు గురించి. ముదిరిపోయిన తమలపాకులు వగరుగా రుచి లేకుండా ఉన్నాయి.

"ఛీఛీ... వెధవ ఆకులు... లతా... లతా... ఈ ఆకులు మరీ ఇలా వున్నాయేం?" అని విసుక్కున్నాడు. లోపలనుంచి లత సమాధానం చెప్పింది.

"ఇవ్వాళ తెచ్చిన ఆకులు సంచీలో వున్నాయి. అవి తీసుకోండి" అని.

వంటింట్లో ఓ మూల కూరలసంచీ వుంది. సంచి తిరగేసి కూరలు దిమ్మరించాడు. లేత తమలపాకులకట్ట బయట పడింది. దాంతోపాటే మరో ప్యాకెట్టూ...

కుతూహలంగా చేతిలోకి తీసుకున్నాడు.

అప్పుడే పిల్లలిద్దరూ స్కూలునుంచి వచ్చారు.

"హాయ్ డాడ్... మమ్మీ ఏదీ?" అనడిగారు.

"లోపలుంది!" అన్నాడు రంగనాథం ఆ పాకెట్ విప్పుతూ.

"హమ్మయ్య ఇవాళ అమ్మ ఇంట్లోవుంది. లేకపోతే రోజూ ఆ కూరల మార్కెట్‌కు వెళ్ళి కూర్చుంటుంది... ఆ మార్కెట్లో ఏముంది?" రంగనాథం పెద్దకొడుకు అన్నాడు.

"ఇవాళ డాడీ వస్తాడని మమ్మీకి తెలుసు. అందుకే ఇంట్లో వుంది..."

పాకెట్ తెరిచాడు రంగనాథం. ఫొటోలు వెనక ఇలా వ్రాసివుంది. "విత్ లవ్.." అని ఎవరిదో సంతకం తిరగేసి చూశాడు. బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు.

అగ్నిపర్వతం పగిలి లావా మొహంమీద చిమ్మినట్టయింది రంగనాథానికి...

ఆ ఫొటోలో చింతమొద్దులాటి గుర్నాథం — గులాబీలాటి లత ప్రక్కనా లత ఎంతో తమకంతో గుర్నాథాన్ని అతుక్కుపోయింది.. కాంక్షతో వాడి కళ్ళలో కళ్ళుపెట్టి... లత పూర్తిపేరు మాధవీలత. ❀